క్లుప్తంగా

రాజీవ్‌గాంధీకి నివాళి

నంద్యాల(అర్బన్‌): పంచాయతీరాజ్‌ వ్యవస్థ బలోపేతానికి గ్రామాలకు నేరుగా నిధులు ఇచ్చే చట్టాన్ని తెచ్చిన ఘనత రాజీవ్‌గాంధీ దేనని ఏపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల మోహన్‌రావు, పట్టణ అధ్యక్షుడు చింతలయ్య కొనియాడారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 32వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక పొన్నాపురం కాలనీలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పార్టీ నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. అంతకుముందు సీఎస్‌ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నాయకులు ఊకొట్టు వాసు, పుల్లయ్య, శ్రీరాం, మస్తాన్‌ఖాన్‌ పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్‌ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్‌ సరఫరా చేస్తున్నట్లు ఇన్‌చార్జ్‌ ఏఈ భగవాన్‌ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజుల పాటు కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె, హరివరం, ఎస్‌.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు త్రీఫేస్‌ విద్యుత్‌ సరఫరా చేస్తామని వివరించారు.

ట్రాక్టర్లు, జేసీబీ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్‌, జేసీబీ

రుద్రవరం: మండలంలోని హరినగరం గ్రామ సమీపంలో అక్రమంగా జరుపుతున్న అక్రమ మట్టి తవ్వకాలపై రెవెన్యూ, పోలీస్‌ అధికారులు ఆదివారం సంయుక్తంగా దాడి చేశారు. రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీని స్వాధీనం చేసుకున్నట్లు వీఆర్‌ఓ ఓబులేసు తెలిపారు. చిత్రేణిపల్లె గ్రామ రెవెన్యూ పరిధిలోని హరినగరం, ముకుందాపురం, గ్రామాల మధ్యలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. ఆలమూరు గ్రామానికి చెందిన ఒక జేసీబీ, రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు.

నివాళి

నంద్యాల(అర్బన్‌): తాను నమ్ముకున్న నాయకుడి కోసం ప్రాణాలు వదిలిన బోయ సాంబశివుడి చిత్రపటానికి స్థానిక వీఆర్‌పీఎస్‌ నాయకులు నివాళులర్పించారు. ఆదివారం స్థానిక వాల్మీకి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వీఆర్‌పీఎస్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయ పులికొండన్న, నాయకులు పరమేష్‌, సవారి, ఈశ్వరయ్య పాల్గొన్నారు. పులికొండన్న మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గానికి చెందిన చెరుకులపాడు నారాయణరెడ్డిని ప్రత్యర్థులు హతమార్చుతుండగా తన నాయకుడి ప్రాణాలు కాపాడే క్రమంలో ప్రాణాలు కోల్పోయాడని గుర్తు చేశారు.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

నంద్యాల(అర్బన్‌): వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చి రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని వడ్డెర సంఘం జిల్లా నాయకుడు చల్లా వెంకటేష్‌ కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎస్టీ జాబితాలో చేర్చాలని ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వాలకు విన్నవించుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. పట్టణంలో సంఘం భవన నిర్మాణానికి స్థలంతో పాటు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

రుద్రవరం: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రుద్రవరం ఫారెస్ట్‌ రేంజ్‌ అధికారి శ్రీపతినాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక ఫారెస్ట్‌ కార్యాలయంలో మిషన్‌ లైఫ్‌ ఈవెంట్‌ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నీటిసంరక్షణపై అవగాహన కల్పించారు. ఆహారాన్ని వృథా చేయారాదన్నారు. వేసవిలో విద్యుత్‌ను ఆదా చేసుకోవాలని, పెట్రోల్‌ డీజిల్‌ను మోతాదులో వినియోగించుకోవాలని సూచించారు. చిరుధాన్యాల ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ఫారెస్ట్‌ సెక్షన్‌ అధికారి నాగరాజు, బీట్‌ ఆఫీసర్లు సురేంద్రగౌడ్‌, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

రేపు స్థలాల పంపిణీ

నంద్యాల(సిటీ): నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు మొదటి దశలో ఎంపికైన 3,006 మంది లబ్ధిదారులకు ఈ నెల 23వ తేదీ నుంచి ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్‌ కమిషనర్‌ రవిచంద్రారెడ్డి తెలిపారు. పట్టాల పంపిణీకి సిద్ధంగా ఉన్న స్థలాలను కమిషనర్‌ ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టాలు అందుకున్నవారు వెంటనే గృహ నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. తహసీల్దార్‌ శ్రీనివాసులు, డీఈఈ మధుకుమార్‌, శానిటరీ సూపర్‌వైజర్‌ లక్ష్మీనారాయణ ఉన్నారు.

సీఎం మైనారిటీల పక్షపాతి

బొమ్మలసత్రం: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పేద మైనారిటీల పక్షపాతి అని నంద్యాల జిల్లా మైనారిటీ వింగ్‌ అధ్యక్షుడు యూనుస్‌బాషా అన్నారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 1,814 మంది హజ్‌ యాత్రికులకు రూ.14.50 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ చేయటం సంతోషంగా ఉందన్నారు. హజ్‌ యాత్రకు ఒక్కో యాత్రికుడికి సాధారణంగా రూ.3.85 లక్షల మేర ఖర్చవుతుందని, ప్రభుత్వం రూ.80 వేలు యాత్రికుడి ఖాతాలోకి జమ చేయటం హర్షించదగ్గ విషయమన్నారు.

రయ్‌ మంటూ దూసుకెళ్లెలా రోడ్లు..పాలన సౌలభ్యం కోసం గ్రామ సచివాలయాలు, రైతుల సేవలో రైతు భరోసా కేంద్రాలు.. ముంగిటకే వైద్యం అందేలా విలేజ్‌ హెల్త్‌ క్లినిక్‌లు.. పాడి రైతులకు అండగా బల్క్‌మిల్క్‌ కూలింగ్‌ కేంద్రాలు..యువతలో విజ్ఞానం పెంపొందించేందుకు డిజిటల్‌ లైబ్రరీలు.. ఈ వసతులన్నీ పట్టణంలో కాదు సుమా.. ప్రతి పల్లె ఒడిలో కొలువుదీరాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో నియోజకవర్గంలో అభివృద్ధికి చిరునామాలుగా నిలిచాయి. ఆయా కార్యాలయాల భవనాల నిర్మాణంతో గ్రామాలకు నూతన కళ వచ్చింది. వసతులు సమకూరడంతో ప్రజలకు అవస్థలు తగ్గాయి.



రూ.4.80 కోట్లతో నిర్మించిన డి.వనిపెంట చెంచుగూడెం బ్రిడ్జి

మెరిసిన అభివృద్ధి.. మురిసిన పల్లె

- ఆళ్లగడ్డ నియోజకవర్గంలో వసతుల కల్పనకు రూ 89.526 కోట్లు కేటాయింపు
- పట్టణంలో రూ.47.89 కోట్లు ఖర్చు
- రూ.71.94 కోట్లతో రోడ్లు, బ్రిడ్జీలు, కల్వర్టుల నిర్మాణం
- కొత్త భవనాలతో కళకళలాడుతున్న గ్రామాలు
- 81 గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, 30 వైఎస్సార్‌ హెల్త్‌ క్లిక్‌లు, 53 పాల కేంద్రాలకు భవనాలు నిర్మాణం
- సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం

ఆళ్లగడ్డ: హామీల రొద.. అవి చేస్తాం.. ఇవి చేస్తాం.. నిత్యం ఆర్భాటపు పనులు.. ప్రసంగాలు.. అయినా సమస్యలు మాత్రం కొనసాగేవి. ఇదంతా నాలుగేళ్ల క్రితం వరకు నియోజకవర్గంలో నిత్యకృత్యం. సీఎంగా వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, పాదయాత్రలో గమనించిన ప్రజల అవస్థల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామ సచివాలయ, వలంటీర్‌ వ్యవస్థ, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు షురూ చేశారు. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి చొరవతో నియోజకవర్గంలో ఇంతకు ముందెన్నడూ చూడని అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రతిపక్ష నాయకులు ఎన్ని రకాలుగా విమర్శించినా, ఇబ్బందులు పెట్టినా, ఆరోపణలు చేసినా ఒక పక్క సంక్షేమం, మరో పక్క అభివృద్ధిని కొనసాగిస్తున్నారు.

• ఆళ్లగడ్డ సామాజిక ఆరోగ్య కేంద్రం



ఇది పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం. సుమారు 70 సంవత్సరాలుగా 30 పడకలతో పాత భవనంలో ఇరుగు గదుల్లో ఉండటంతో రోగులు ఇబ్బందులు పడేవారు. అఖిలప్రియ మంత్రిగా ఉన్న సమయంలో వంద పడకల ఆసుపత్రిగా చేయిస్తున్నానని అధికారులను, మంత్రులను ఇక్కడికి తీసుకొచ్చి హంగామా చేశారు. అయినా ఆసుపత్రి మార్పు మాత్రం జరగలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆసుపత్రి ఆధునికీకరణపై ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లి 50 పడకల స్థాయి పెంచడంతో పాటు మొదటి విడతగా రూ.3 కోట్లతో కొత్త భవనం నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించారు.

• సచివాలయం.. సుపరిపాలన కేంద్రం..



గతంలో ప్రభుత్వ సేవలు ఎంత చిన్నవైనా మండల కేంద్రాలకు పరుగెత్తాల్సిందే. ఒక రోజు పనికాక పోతే రోజులు తరబడి తిరాగాల్సి వచ్చేది. జగనన్న పాలనలో గ్రామీణులకు సుపరిపాలన అందించే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. వీటి కోసం నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 81 గ్రామ సచివాలయాల భవనాలను నిర్మించారు. ఇందుకు రూ 24.30 కోట్లు ఖర్చు చేశారు. ఇప్పుడు నిమిషాల్లో ఊర్లోనే పనులు జరుగుతున్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

• అన్నదాత చెంతకే అన్నీ..



వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు ఆర్బీకే చిరునామాగా నిలిచింది. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేందుకు దుకాణాల వద్ద క్యూ కట్టే అవసరం లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు పంట దిగుబడిని కూడా వీటి ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్నారు. ఇంతటి సేవలు అందిస్తున్న రైతు భరోసా కేంద్రాల కోసం పక్కాభవనాల నిర్మాణానికి నియోజకవర్గంలో రూ.17.65 కోట్ల ఖర్చు చేసి 81 భవనాలను పూర్తి చేశారు.

• పల్లె ముంగిటకే వైద్యం..



గ్రామీణులకు నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌ హెల్త్‌ క్లినిక్‌లను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. గ్రామంలోనే జ్వరంతో పాటు ఇతర అనారోగ్యాలకు చికిత్స అందిచేందుకు ప్రతి 2,500 మంది జనాభాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేశారు. 90 రకాల మందులు ఉచితంగా అందజేస్తున్నారు. గ్రామ స్థాయిలో వైద్యసేవలందించేందుకు 30 భవనాలు నిర్మించారు. వీటికి రూ 5.25 కోట్లు వెచ్చించారు.

పాల వెల్లువ కోసం..

పల్లెల్లో పాల వెల్లువ పరిఢవిల్లేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు నాణ్యమైన పాల ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా వైఎస్సార్‌ రైతు భరోసా కేంద్రాలకు అనుబంధంగా నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో రూ 4.80 కోట్లు ఖర్చు చేసి 30 బల్క్‌ మిల్క్‌ కూలింగ్‌ యూనిట్ల బిల్డింగ్‌ నిర్మాణాలు పూర్తి చేశారు.

వాహనాలు దూసుకెళ్లేలా రోడ్లు..

నాడు ఏళ్ల తరబడి గ్రామీణ రహదారులు మరమ్మతులకు నోచుకోలేదు. ఫలితంగా రోడ్లన్నీ గుంతలమయంగా మారి కంకర తేలి నడిచేందుకు కూడా వీలుకానట్లుగా తయారయ్యాయి. వాటిని మార్చేందుకు నియోజకవర్గంలో 138.608 కి.మీ. మేర రహదారుల నిర్మాణాలకు రూ.71.94 కోట్లు ఖర్చు చేశారు. దీంతో ఏ గ్రామానికైనా రయ్‌ మంటూ దూసుకెళ్లేలా రోడ్లు, బ్రిడ్జీల నిర్మాణాలు పూర్తి చేశారు.



ఆళ్లగడ్డ టు కోవెలకుంట్ల రోడ్డు

నాడు అఖిలప్రియ నెరవేర్చని హామీలు..

- దొర్నిపాడులో తహసీల్దార్‌ కార్యాలయానికి కొత్త భవనం నిర్మిస్తామని ఆర్భాటంగా ఉన్న కార్యాలయాన్ని కూల్చి వేశారు. అయితే మూడేళ్లు మంత్రిగా ఉన్నా కనీసం ఒక్క ఇటుకు కూడా పేర్చలేదు. ఫలితంగా ప్రస్తుతం మండల పరిషత్‌ కార్యాలయంలో సిబ్బంది రెండు గదుల్లో విధులు నిర్వహిస్తున్నారు.
- అమ్మిరెడ్డినగరం నుంచి నందిపల్లె వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినా ఇంతవరకు కంకర తేలిన రోడ్డులోనే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు



రూ.25 కోట్లుతో మరమ్మతులు చేస్తున్న తెలుగుగంగ కాలువ

- చాగలమర్రిలో 80 ఎకరాల ప్రభుత్వ స్థలంలో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తానని హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు.
- జి.జమ్ములదిన్నె గ్రామం నుంచి నంద్యాల హైవే వరకు రెండు బ్రిడ్జీలు, రోడ్డు వేయిస్తానని చెప్పి నెరవేర్చలేదు.
- నీరు–చెట్టులో భాగంగా పనులు చేయకుండానే దాదాపు రూ.150 కోట్లు మెక్కేశారని ప్రజలు గ్రహించారు.

నియోజకవర్గంలో పంచాయతీరాజ్‌ శాఖ ఆధ్వర్యంలో ఖర్చు చేసిన నిధులు, చేపట్టిన పనులు..

గ్రాంట్‌	చేపట్టిన పనులు	ఖర్చు పెట్టింది (రూ.లక్షల్లో)
గడగడపకు	72	408.45
సీఎండీఎఫ్‌	10	95.35
ఎంపి నిధులు	15	181.10
జెడ్పీ నిధులు	8	75.00
ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్‌	122	871.61
గ్రామ సచివాలయాలు	81	243.00
ఆర్బీకేలు	81	176.58
వైఎస్సార్‌ హెల్త్‌ క్లినిక్‌లు	30	52.50
బల్క్‌ మిల్క్‌ కూలింగ్‌ యూనిట్ల	30	52.50
డిజిటల్‌ లైబ్రరీలు	24	387.5

పెనుగాలులకు తెగిపడిన విద్యుత్‌ తీగలు

నంద్యాల(అర్బన్‌): జిల్లాలోని పలు మండలాల్లో శనివారం సాయంత్రం వీచిన పెనుగాలులకు విద్యుత్‌ స్తంభాలు నేలకొరగడంతో గ్రామీణ ప్రజలు అవస్థలు పడ్డారు. పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలకు విద్యుత్‌ తీగలు తెగిపడడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. జిల్లాలోని ఆళ్లగడ్డ–గోవిందపల్లె సబ్‌స్టేషన్‌ పరిధిలో 20 విద్యుత్‌ స్తంభాలు, బండిఆత్మకూరు–ఎర్రగుంట్ల ప్రాంతాలలో 11కేవీ ఫీడర్‌ పరిధిలో 11, గాజులపల్లె–బోయలకుంట్ల మార్గాలలో 5 విద్యుత్‌ స్తంభాలతో పాటు కొలిమిగుండ్ల సమీపంలో ప్రధాన రహదారిపై స్తంభం నేలకు ఒరగడంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నంద్యాల మండలం, వెలుగోడు, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, రుద్రవరం తదితర మండలాల్లోని గ్రామాల్లో విద్యుత్‌ సరఫరా నిలిచి పోయింది. అప్రమత్తమైన విద్యుత్‌ సిబ్బంది యుద్ధ ప్రాతిదికన కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్‌ సరఫరాను పునరుద్ధరించారని జిల్లా విద్యుత్‌ శాఖ అధికారి రమణారెడ్డి తెలిపారు.



మిట్నాలలో కిందపడిన విద్యుత్‌ తీగలు,



బండిఆత్మకూరు పంటపొలాల్లో మరమ్మతులు చేస్తున్న విద్యుత్‌ సిబ్బంది

గాలి బీభత్సం

దొర్నిపాడు: రెండు రోజులుగా సాయంత్రం వేళలో ఈదురు గాలులు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఆదివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులుకు మండలంలోని క్రిష్టిపాడు గ్రామానికి చెందిన మహేష్‌ అనే వ్యక్తి ఇంటి వేసుకున్న రేకులు ఎగిరిపోయాయి. ఆలాగే కాలనీలో విద్యుత్‌ స్తంభం విరిగి పోయింది. అయితే లైన్‌మెన్‌ నాగన్న విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగకుండా వెంటనే సరఫరాను పునరుద్ధరించారు.



క్రిష్టిపాడులో ఎగిరిపడిన ఇంటి పైకప్పు

మండ్లెంలో విద్యుత్‌ తీగల చోరీ

జూపాడుబంగ్లా: మండలంలోని మండ్లెం గ్రామానికి చెందిన 30 మంది రైతుల వ్యవసాయ పొలాల వద్ద నున్న బోర్లు, బావుల విద్యుత్‌ మోటార్ల తీగలు చోరీకి గురికావటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం తెల్లవారు జామున మండ్లెం గ్రామానికి చెందిన జిలేబిబాషా, హబీబుల్లా, సలాం, శ్రీను, మాబాషా, నైమత్‌భాష, జంగాల మార్కండేయ, చాంద్‌భాష, అబ్దుల్‌రహమాన్‌, శ్రీకాంత్‌ వీరితో పాటు మరో 20మంది రైతులకు చెందిన విద్యుత్‌ తీగలను గుర్తుతెలియని వ్యక్తులు కట్‌ చేసుకొని ఎత్తుకెళ్లారు. ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు మోటార్ల స్విచ్చులు ఆన్‌చేయగా ఎంతకీ ఆడకపోవటంతో విద్యుత్‌ తీగలను పరిశీలించగా చోరీకి గురైన విషయాన్ని గుర్తించారు. రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన 20 మంది రైతులకు చెందిన విద్యుత్‌ తీగలు కూడా చోరీ అయినట్లు గ్రామస్తులు తెలిపారు. రైతులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

ఉత్తమ జీవనానికి సోపానాలు ఇతిహాసాలు

కర్నూలు కల్చరల్‌: ఉత్తమ జీవనానికి భారత, భాగవత, రామాయణ ఇతిహాసాలు సోపానాలుగా నిలుస్తాయని ఇస్కాన్‌ ప్రవచకులు వైష్ణోకృప చైతన్య ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభుపాదుల ప్రేమ విందు కార్యక్రమం నిర్వహించారు. జగన్నాథ్‌, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. అనంతరం వైష్ణోకృప చైతన్య ప్రభు సందేశమిస్తూ భగవద్గీత పఠనం, శ్రవణంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. జటిలమైన సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతాయన్నారు. పిల్లలకు విద్యార్థి దశ నుంచే దేశభక్తి, ఆధ్యాత్మిక అంశాలపై ఆసక్తి కలిగేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇస్కాన్‌ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



సందేశమిస్తున్న వైష్ణోకృప చైతన్య ప్రభు

గస్తీతో నేరాల నియంత్రణ

బొమ్మలసత్రం: రాత్రి సమయంలో పోలీస్‌ సిబ్బంది నిర్వహించే గస్తీతో నేరాలను నియంత్రించవచ్చని జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం డోన్‌ సబ్‌డివిజన్‌ పోలీస్‌ అధికారులతో జూమ్‌ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌ కేసులపై దర్యాప్తు ముమ్మరం చేయాలని సూచించారు. హత్యలు, హత్యాయత్నాలు, మహిళలపై దాడులు, మిస్సింగ్‌, ఆస్తి తగాదాలు, రోడ్డు ప్రమాదాల కేసుల్లో సాంకేతికతను వినియోగించుకొని కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కోర్టులో నడిచే కేసుల్లో నిందితులు తప్పించుకోకుండా తగిన సాక్షాధారాలు సమర్పించి శిక్షలు పడేలా చూడాలన్నారు. ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాల పనితీరు, కెమెరాల ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్‌స్పాట్‌లుగా ప్రకటించి ప్రయాణికులను అప్రమత్తం చేసేలా సూచికలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆన్‌లైన్‌, లోన్‌యాప్‌ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఎస్‌బీ డీఎస్పీ సంతోష్‌, సీఐ దస్తగిరిబాబు, సీఐ జయరాములు, ఎస్‌ఐ అశోక్‌, రమేష్‌ పాల్గొన్నారు.



జూమ్‌ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్‌ రెడ్డి

ప్రతిపక్షానికి నిజంగా ఖర్మ పట్టింది

శ్రీశైలం టెంపుల్‌: రాష్ట్రానికి సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో అభివృద్ధి చేస్తుంటే.. ఇదేం ఖర్మ అని ప్రతిపక్షం తిరుగుతోందని, నిజంగానే వారికి ఖర్మ పట్టిందని ఏపీ శాసనసభ స్పీకర్‌ తమ్మినేని సీతారాం అన్నారు. ఆదివారం ఆయన కుటుంబ సమేతంగా శ్రీశైలం శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీకి, ఎల్లో మీడియాకు ప్రజల చేతుల్లో వీరబాదుడు తప్పదన్నారు. ప్రతిపక్ష శాసన సభ్యులు సభలో ఉండి ప్రభుత్వం తప్పు చేస్తే ప్రశ్నించాలి కానీ స్పీకర్‌ పోడియం వద్దకు వచ్చి నిరసన తెలియజేస్తే ఎలా అని ప్రశ్నించారు. లోకేష్‌ పాదయాత్రను ప్రజలే విశ్వసించడం లేదని, ఇక మా పార్టీ ఆ పాదయాత్ర గురించి ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అన్నింటినీ నెరవేర్చాం కాబట్టి 175 సీట్లకు 175 సీట్లు గెలుస్తామని ధీమాగా ఉన్నట్లు చెప్పారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు చేయాలి కాబట్టి చేస్తున్నాయి కానీ, లేకుంటే వారికి రోజు గడవదని విమర్శించారు. గతంలో టీడీపీకి మూడుసార్లు అధికారం ఇస్తే ప్రజలకు ఏమీ చేయకుండా.. ఇప్పుడు మళ్లీ అవకాశం ఇవ్వాలని అడగటాన్ని ప్రజలు విశ్వసించడం లేదన్నారు.



స్పీకర్‌ తమ్మినేని సీతారాం దంపతులకు స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ అధికారులు

ఊరూరా 'ఉపాధి'

- ఈ ఏడాది 2.09 లక్షల పనిదినాల కల్పన లక్ష్యం
- రూ. 5.68 కోట్లతో లేబర్‌ బడ్జెట్‌
- వ్యవసాయ పనులు ముగియడంతో ఊపందుకున్న ఉపాధి పనులు
- రోజుకు 3,316 మందికి గాను 2,563 మంది కూలీలు పనులకు హాజరు

ఉయ్యాలవాడ : గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు ఊపందుకున్నాయి. ఈ ఏడాది 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన వివిధ పనులను గుర్తించారు. మండలంలో 2.09 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇందు కోసం వేతనం, మెటీరియల్‌ ఖర్చుతో కలుపుకుని రూ.5.68 కోట్లతో లేబర్‌ బడ్జెట్‌ రూపొందించారు. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో రోజువారి కూలీలు 1,840 మంది పాల్గొన్నారు. మండలంలో 6,248 జాబ్‌ కార్డులున్న కుటుంబాలు ఉన్నాయి. ఇందులో 11,655 మంది కూలీలున్నారు. ప్రభుత్వం రోజుకు 3,316 మంది కూలీలు పనుల్లో పాల్గొనాలని ఆదేశించింది. అయితే ఈ నెలలో రోజు వారి కూలీల సంఖ్య 2,563 మందికి చేరుకుంది. రైతులు, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉపాధి శాఖ అధికారులు ఆమోదయోగ్యమైన పనులు గుర్తించారు. పొలాలకు వెళ్లే రస్తాల ఏర్పాటు, పంట కాలువలు, కుంటలు, చెరువుల్లో పూడికతీత, ఫాంపాండ్స్‌ పనులు, ఉద్యానవన పంటల సాగు కింద మామిడి, చీని, నిమ్మ, సపోటా, కొబ్బరి, సీతాఫలం, అల్లనేరేడు, డ్రాగన్‌ ఫ్రూట్స్‌ తదితర పండ్ల తోటల సాగు, పంచాయతీరాజ్‌, ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడం, వాటి సంరక్షణ వంటి పనులు చేపట్టేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

పెరిగిన కూలి..

గతేడాది వరకు గరిష్ట వేతనం 257 వరకు చెల్లించేవారు. ప్రస్తుతం రూ.272 చెల్లిస్తున్నారు. నిర్దేశించిన కొలతల మేరకు పనిచేస్తే కూలీలకు గరిష్ట వేతనం లభిస్తుంది. అయితే ఇందుకు ఉపాధి హామీ పథకం సిబ్బంది కొలతలతో పాటు సమయానుకూలంగా పనిచేయిస్తే వారికి పెంచిన కూలి లభించే అవకాశముంది. ఇప్పటికే అధికారులు గరిష్ట వేతనం పొందేలా సిబ్బందికి అవగాహన కల్పించారు.





హరివరం సమీపంలో కుంటలో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు, ఆర్‌.పాంపల్లె వద్ద పొలాలకు వెళ్లే రస్తా ఏర్పాటుకు మట్టి పని చేస్తున్న కూలీలు

కూలి పెంచడం సంతోషంగా ఉంది



ప్రస్తుతం వ్యవసాయ పనులు పూర్తి కావడంతో కుటుంబ సభ్యులందరం ఉపాధి పనులకు వెళ్తున్నాం. గత ఏడాది మా కుటుంబానికి వంద రోజులు పనులు కల్పించారు. ప్రస్తుతం గ్రామ సమీపంలో రస్తా పనులు చేస్తున్నాం. రోజుకు గరిష్టంగా రూ. 230 నుంచి రూ. 260ల వరకు కూలి అందజేస్తున్నారు. ప్రభుత్వం గరిష్ట కూలి రూ.272కు పెంచడం సంతోషంగా ఉంది.

– టి.సుబ్బలక్ష్మమ్మ, ఉపాధి కూలీ, ఆర్‌.పాంపల్లె

నిర్దేశించిన సమయం, కొలతల మేర పనిచేస్తే గరిష్ట వేతనం

ప్రస్తుతం ఉపాధి పనులకు వెళ్లే కూలీలకు గరిష్టంగా రోజుకు రూ. 272 వేతనం అందిస్తున్నాం. గతంలో రోజు రూ. 257 ఇస్తుండగా గత నెల నుంచి ఆ మొత్తాన్ని ప్రభుత్వం రూ. 272కు పెంచింది. అయితే నిర్దేశించిన కొలతల ప్రకారం రోజుకు 6 గంటలు పని చేస్తే ఆ వేతనం కూలీల ఖాతాల్లో జమ అవుతుంది.

– రవిప్రకాష్‌, ఉపాధి ఏపీఓ

దరఖాస్తు చేసుకోండి

శిరివెళ్ల: స్థానిక మోడల్‌ స్కూల్‌లో మొదటి సంవత్సరం ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు ప్రిన్సిపాల్‌ ఇఫ్రత్‌బేగం ఆదివారం తెలిపారు. ఈ నెల 22 నుంచి జూన్‌7వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూప్‌లు అందుబాటులో ఉన్నాయని, ఓసీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీలు రూ.150 ఫీజు చెల్లించాలని చెప్పారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.

ఉయ్యాలవాడ : స్థానిక ఏపీ మోడల్‌ స్కూల్‌లో ఇంటర్‌ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం సోమవారం నుంచి జూన్‌ 7వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ నూర్జహాన్‌ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఇంటర్‌లో మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో చేరే విద్యార్థులు ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలల్లో 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు.

అగ్నిప్రమాదం

రుద్రవరం: స్థానిక బెస్తకాలనీలో రవణమ్మ ఇంట్లో ఆదివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఇంటిపై ఉన్న విద్యుత్‌ తీగలు గాలికి రాపిడి జరగడంతో మంటలు వ్యాపించి ఇంటిపై పడ్డాయి. దీంతో ఇంట్లోని ధాన్యం, బట్టలు, వంట సామగ్రి కాలిబూడిదయ్యాయి. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అధికారులు స్పందించి ఆదుకోవాలని బాధితురాలు కన్నీరుమున్నీరైంది.